క్లుప్తంగా

యువ ఇంజినీర్లకు స్ఫూర్తి మోక్షగుండం



చిలకలూరిపేట: యువ ఇంజినీర్లకు స్ఫూర్తి ప్రదాత మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని లైసెన్సెడ్ సర్వేయర్స్ అండ్ ఇంజినీర్స్ అసోసియేషన్ సభ్యులు కొనియాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్‌డేను ఆదివారం నిర్వహించారు. తొలుత మోక్ష గుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అనేక ప్రాజెక్టుల నిర్మాణంలోనూ, పరిశ్రమల స్థాపనలోనూ ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. యువ ఇంజినీర్లు విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకొని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్యామ్, జబ్బార్, చంద్రా, శ్రీనివాస్, మధు, భానుప్రసాద్, సాదిక్, షరీఫ్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



చిలకలూరిపేట: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) స్వర్ణోత్సవాలలో భాగంగా నియోజకవర్గ స్థాయి ఉపాధ్యాయ క్రీడా సంబరాలు పట్టణంలోని సాదినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటీలను స్కూల్ డైరెక్టర్ ప్రభాకరరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. షాట్‌పుట్, రన్నింగ్, క్యారమ్స్, చెస్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. సోమవారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. షేక్ అచ్చేమియా, ఖాదర్‌మస్తాన్, ఇస్మాయిల్, నాగరాజు, నాగమణి,రాజు న్యాయనిర్ణేతలు వ్యవహరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.తిరుపతిస్వామి, నాయకులు టి.సుధాకర్ హరిప్రసాద్, ఎస్‌కేఎండీ యాసిన్, కె.స్నేహలత, కె.అరుణ పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

నరసరావుపేట: విజయవాడ వరదలలో సర్వం కోల్పోయిన పేదవారికి సహాయం అందించేందుకు స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. ఆదివారం ఐదో వార్డు నాయకులు కందుల ఎర్రా దుప్పట్లు, చీరలు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ప్రతి ఒక్కరూ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని, వారి కష్టాల్లో పాలు పంచుకోవాలని డాక్టర్ గోపిరెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు స్పందిస్తున్నాయి. స్వచ్ఛందంగా ముందు వస్తున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

నరసరావుపేట: పట్టణంలోని మోర్ సెంటర్‌లో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వీరమళ్ళ వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నేషనల్ కౌన్సిల్ మెంబర్ వల్లెపు కృపారావు, జిల్లా సంయోజక్ చిరుమామిళ్ళ ఆదినారాయణ రావు, పట్టణ సభ్యత్వ ప్రముఖ్ అన్నపురెడ్డి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. పట్టణంలోని ప్రముఖ వైద్యులు రాఘవేంద్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ అనిరుధ్ ఫణి భార్గవ్ పార్టీ శ్రేణుల సమక్షంలో కృపారావు చేతుల మీదుగా సభ్యత్వం అందుకుని, పార్టీలో చేరడం పట్ల తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. నాయకులు గుడిపల్లి కృష్ణమోహన్, కాటా అంజనారెడ్డి, మేడికొండ సత్యానందబాబు, ఎం.కబ్బిరెడ్డి, మైలవరపు సుబ్బారావు, అమ్మ జిలానీ, రాజనాల వెంకట రాజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితులపై వివక్ష వద్దు



చిలకలూరిపేటటౌన్: హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితులపై వివక్షత చూపడం తగదని క్యాంపు స్వచ్ఛంద సంస్థ కౌన్సిలర్ కాకుమాను హనుమంతరావు చెప్పారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు 'మీకు తెలుసా?' హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అవగాహన సదస్సు గణపవరం ధనలక్ష్మి మిల్లులో నిర్వహించారు. మిల్లులోని ఒడిశా, శ్రీకాకుళం, విజయనగరం కార్మికులు, రాగన్నపాలెం రిస్క్ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో క్యాంపు ప్రాజెక్టు మేనేజర్ ఐ.రోహిణి, ఆశ వర్కర్లు శామీమ్, లక్ష్మి, పెద్దబ్బాయ్ పాల్గొన్నారు.



వరి నాట్లు వేస్తున్న కూలీలు



వరి సాగుకు సిద్ధమైన నారుమడి



దమ్ము చేస్తున్న ట్రాక్టర్

అన్నదాత బిజీబిజీ..

నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలో మేజరు, మైనరు కాలువలు నీటితో కళకళ లాడుతున్నాయి. ఆయకట్టు పరిధిలో అధికంగా వరి సాగు చేస్తుంటారు. వర్షాలు అధికంగా కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. రైతు, రైతు కూలీలు వ్యవసాయ యంత్ర పరికరాలు ఉన్న వారందరు ముమ్మరంగా వరి నాట్లలో నిమగ్నం అయ్యారు. వినుకొండ నియోజకవర్గంలో ఐదు మండలాలు అధికంగా వరి పంట సాగుకు అన్నదాతలు మొగ్గు చూపుతారు. వాగులు, బావులు, కుంటలు, మోటారు ద్వారా కూడా వరి పంట వేసి కలుపులు తీస్తున్నారు. వరినాట్లు వేయటానికి పొలాలను ట్రాక్టర్లుతో దమ్ము చేస్తున్నారు.

-శావల్యాపురం

పట్టణాల్లోనూ ఉపాధి పథకం అమలు చేయాలి

చిలకలూరిపేట: పట్టణ ప్రాంతాలలోనూ ఉపాధి హామీపథకాన్ని అమలు చేయాలని పల్నాడు జిల్లా సీపీఎం నాయకుడు వై.రాధాకృష్ణ కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ 12వ మహాసభ ఆదివారం నిర్వహించారు. తొలుత ఇటీవల మృతి చెందిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. కౌలురైతులకు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు చెల్లించాలని కోరారు. అర్హులైన వారికి పింఛన్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. మహిళల రక్షణ కోసం చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. పార్టీ నాయకులు బొల్లు శంకరరావు అధ్యక్షత వహించిన మహాసభలో నాయకులు పేరుబోయిన వెంకటేశ్వర్లు, జల్లెడ రాజశేఖర్, పి.శివగణేష్, ఏవీ శివయ్య, పి.భారతి, జి.సావిత్రి పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెంలో ఆదివారం నిర్వహించిన వినాయక నిమజ్జనోత్సవ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పందిట్లో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూ ప్రసాదాన్ని గ్రామానికి చెందిన నెమలిదిన్నె కృష్ణారెడ్డి రూ.47 వేలకు దక్కించుకున్నాడు. అనంతరం వినాయకుని నిమజ్జనోత్సవ రథానికి గుమ్మడికాయతో డాక్టర్ గోపిరెడ్డి దిష్టి తీసి నిమజ్జన ప్రయాణాన్ని ప్రారంభించారు. వినయాక నిమజ్జనోత్సవ రథాన్ని ఆయన కొద్దిసేపు నడిపారు. గ్రామానికి సమీపంలో ఉన్న తంగేడుమల్లి మేజర్ కాల్వలో వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల కనీ్వనర్ కురుగుంట శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు పచ్చవ రవీంద్రబాబు, బత్తుల రామకృష్ణ, వీరం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గణేశ్ విగ్రహాల నిమజ్జనం

నాదెండ్ల: గణేశ్ నిమజ్జనాలు ఆదివారం కొనసాగింది. మండల పరిధిలో 11 విగ్రహాలకు నిమజ్జనం చేశారు. మేజర్ పంచాయతీ గణపవరంలో ఏడు విగ్రహాలు, ఎండుగుంపాలెం, నాదెండ్ల, తూబాడు, కనపర్రు గ్రామాల్లో ఒక్కోటి చొప్పున నిమజ్జనాలు చేశారు. గణపవరంలో శివనాగేంద్రస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహం వద్ద, కోండ్రువారివీధిలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుని విగ్రహం వద్ద లడ్డూల వేలం నిర్వహించగా పెద్ద మొత్తంలో చెల్లించి భక్తులు దక్కించుకున్నారు.

రూ.1.46 లక్షలు పలికిన రెడ్డినగర్ లడ్డూ

నరసరావుపేట రూరల్: రెడ్డినగర్‌లో లడ్డూల వేలంలో రికార్డు ధర పలికింది. పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించిన రెండు లడ్డూలను రూ.2.47 లక్షలకు స్థానికులు కై వసం చేసుకున్నారు. రెడ్డినగర్‌లోని గణేష్ మండపంలో పూజలందుకుంటున్న గణనాథుడిని ఆదివారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం నిర్వహించారు. హోరాహోరీగా నిర్వహించిన లడ్డూల వేలంలో 36 కేజీల లడ్డూను మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి బ్రదర్స్ రూ.1.46 లక్షలకు, 27 కేజీల లడ్డూను సానికొమ్ము సుజాత రూ.1.01లక్షలకు దక్కించుకున్నారు. అనంతరం లక్కీడిప్ ద్వారా పలు బహుమతులు అందజేశారు. నిమజ్జన ఊరేగింపు సందడిగా సాగింది.



నిమజ్జనానికి తరలిన రథాన్ని నడుపుతున్న మాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



రెడ్డినగర్‌లో రూ.1.46 లక్షలకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న శ్రీనివాసరెడ్డి

అరండల్‌పేట రామాలయం మహా గణపతి లడ్డూ రూ.1,00,116



నరసరావుపేట: పట్టణంలోని అరండల్‌పేట రామాలయం వద్దనున్న మహాగణపతి వినాయకుని పందిరిలో శివలింగాకారంలో ఏర్పాటుచేసిన 49 కేజీల స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని ఆదివారం నిర్వహించిన వేలంపాటలో అదే ప్రాంతానికి చెందిన బండి శివ రూ.1.00,116లకు దక్కించుకున్నారు. అనంతరం వేడుకగా వినాయకుని నిమజ్జనానికి తరలించారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



చినమసీదు వీధిలో ప్రార్థనలకు హాజరైన ముస్లిం కుటుంబాలు

చిలకలూరిపేటటౌన్: సమాజంలో దురాచారాలను పెకలించి.. మానవాళిని సన్మార్గం వైపు నడిపించిన మొహమ్మద్ ప్రవక్త బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయమని ముఫ్తి మొహమ్మద్ అబ్దుల్ కలీం చెప్పారు. మండలంలోని పసుమర్రు గ్రామంలోని చినమసీదు బజారులోని ఆదివారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెండా చెట్టు వద్ద ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో ఆయన పాల్గొని మొహమ్మద్ ప్రవక్త(సఅసం) జన్మదినాన్ని ఈ మాసమంతా ముస్లింలు వాడవాడలా ఎంతో ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. చినమసీదు వీధిలోని ముస్లిం కుటుంబాలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు సమష్టిగా చేయడం అభినందనీయం అన్నారు. మౌలానా బాజీ, సుల్తాన్ దువా చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలను షేక్ మస్తాన్ షరీఫ్–నసీమా, అబ్దుల్‌రవూఫ్–గౌసియా, అబ్దుల్ రవూఫ్–మెహెర్, ఫర్మానుల్లా–సానియా, సమీర్, ఖాదర్‌మస్తాన్ పర్యవేక్షించారు.

చిన్నారుల విద్యపై జాగ్రత్తలు తీసుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వనమా పూర్ణచంద్రరావు

అమరావతి: ఆధునిక ప్రపంచంలో విద్యా వ్యవస్థలో పెనుమార్పులు సంభవిస్తున్నాయని, చిన్నారుల విద్య పట్ల ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలని గుంటూరు విభాగ్ అధ్యక్షుడు వనమా పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిరంలో గుంటూరు విభాగ్ ఫౌండేషన్ లెవెల్ టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం రెండవ రోజు ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ప్రధానాచార్యులు కోలా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. పూర్ణచంద్రరావవు మాట్లాడుతూ చిన్నారులకు పంచకోశాత్మక వికాసాలు కలిగే విధంగా విద్యా విధానం ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పూర్వ ప్రధాన ఆచార్యులు సోమిశెట్టి శివపార్వతి మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే నైపుణ్యం, సృజనాత్మకత కలిగించే విధంగా విద్యా విధానం కొనసాగాలని అందుకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అమరేశ్వరాలయ ఈఓ వేమూరి గోపి విశ్వనాథ శర్మ, పాఠశాల సభ్యులు శనగవరపు రామ్మోహన్ శర్మ, పులిపాటి పవన్ కుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని శిశుమందిర్ ఆచార్యులు పాల్గొన్నారు.

కొండమెట్ల ఆలయంలో పూర్ణాహుతి

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండమెట్ల వద్ద స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ ఉత్సవాలు 9వ రోజుకు చేరుకున్నాయి. స్వామి వారికి 11 రకాల అభిషేకాలు, సహస్రనామార్చన, గణపతి నవగ్రహ సమేత ఆంజనేయ స్వామి మొదలగు హోమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని ప్రత్యేక పూజలు, హోమంలో పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండ అభివృద్ధి, మెట్ల అభివృద్ధి చేసి భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం లడ్డూ వేలంపాట మరియు వినాయక నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీగుమ్మడి సదాశివరావు, పేరూరి శ్రీనివాసరావు, బ్యాంక్ నాగేశ్వరరావు, పువ్వాడ సుబ్రహ్మణ్యం, అరవింద్, అడ్డగిరి తారక్, నరసింహారావు, కాసాని వెంకటసుబ్బారావు, సనిశెట్టి వెంకట సుబ్బారావు, కాకుమాను కోటేశ్వరరావు పాల్గొన్నారు.



హోమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

కరెన్సీ నోట్లతో అలంకరణ..



రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలోని శ్రీ గంగాపార్వతీ సమేత వల్లభేశ్వరి స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకుని మట్టి విగ్రహానికి ఆదివారం తొమ్మిదో రోజు పూజలు నిర్వహించారు. స్వామిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. 11 రోజుల పాటు పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహానికి నిమజ్జనోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే వి.రెడ్డిపాలెం గ్రామంలో వినాయకుని దేవాలయంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి పూజలు నిర్వహించిన అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

నిమజ్జనోత్సవంలో ఘర్షణ

ముప్పాళ్ళ: వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన వివాదం ముదిరి రెండు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఇందులో ఒకరికి గాయాలైన ఘటన ఇరుకుపాలెంలో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామంలోని బీసీ కాలనీలో ఒకే సామాజిక వర్గానికి చెందిన నార్నెపాటి సాంబశివరావు, కొర్నెపాటి యలమంద వర్గీయులు వేర్వేరు వినాయక మండపాలు ఏర్పాటు చేసుకున్నారు. రెండు వర్గాల వినాయకస్వామి నిమజ్జనాల సందర్భంగా స్వల్ప వివాదలు చోటుచేసుకున్నాయి. ఆదివారం రెండు వర్గాల వారు ఒకరిపై ఒకరు ఘర్షణకు దిగటంతో కొర్నెపాటి యలమంద తలకు గాయమైంది. అతనిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు.

49 కేసుల పరిష్కారం

అమరావతి: మండలానికి చెందిన పలు కేసులు శనివారం సత్తెనపల్లి కోర్టుల్లో నిర్వహించిన లోక్ ఆదాలత్‌లో పరిష్కరించారని అమరావతి సీఐ ఎం.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇరు వర్గాల రాజీకి అంగీకరించిన అనంతరం మండలానికి చెందిన 14 కేసులు పరిష్కారమైనట్లు చెప్పారు. అలాగే జూదం, రవాణాకు సంబంధించిన 35 కేసులు ఉన్నట్లు వెల్లడించారు.

చెట్ల తొలగింపు

క్రోసూరు: ఇటీవల కురిసిన వర్షాలకు తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న జామాయిల్ చెట్లు భవనంపై పడిపోయాయి. తహసీల్దార్ ఆదేశాల మేరకు వాటిని తొలిగించారు. విద్యుత్ తీగలు తెగిపోయానని, పార్కింగ్ కూడా సమస్యగా మారిందని తహసీల్దార్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

■ ఉద్యమాల వేగు చుక్క ఏచూరి

పెదకూరపాడు: ఉద్యమాల వేగు చుక్క సీతారం ఏచూరి అని క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ బెల్లంకొండ రామగోపాలరావు అన్నారు. పెదకూరపాడులో సీపీఎం ఆధ్వర్యంలో సీతారం ఏచూరి చిత్రపటానికి ఆదివారం నివాళులర్పించారు. తను నమ్ముకున్న సిద్ధాంతాలకు కట్టుబడి గత 50 ఏళ్ల సీపీఎంలో ఏచూరి కృషి ఆదర్శమన్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు, కాల్వ అప్పారావు, గుప్తా వెంకటేశ్వర్లు, మలినేని నరసింహారావు, రామనాథం, కొనగండ్ల సాంబశివరావు, మస్తాన్ రావు నివాళులర్పించారు.

సమస్యల గురుకులం..!

- కొత్తగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు అందని యూనిఫాం
- 564 మంది విద్యార్థులకు 40 మరుగుదొడ్లు మాత్రమే
- గత ప్రభుత్వ నిధులతో కొంతమేర మరమ్మతులు

అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థుల చదువులు సమస్యల మధ్య కొనసాగుతున్నాయి. నూతనంగా అడ్మిషన్ పొందిన 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులతో పాటు, ఖాళీల భర్తీల్లో సీట్లు పొందిన విద్యార్థులకు యూనిఫాం ఇంతవరకు అందలేదు. గత ప్రభుత్వం ఏటా జూన్‌లోనే విద్యార్థులందరికీ మూడు జతల చొప్పున యూనిఫాం ఇవ్వడం జరిగింది. కుట్టు కూలి కూడా ఇచ్చేవారు. పాఠశాల తెరిచి మూడు నెలలు కావస్తోంది. కానీ, ఈ ఏడాది ఇంత వరకు కొత్తగా చేరిన విద్యార్థులకు యూనిఫాం ఇవ్వలేదు.



తలుపులేని మరుగుదొడ్లు

మరుగుదొడ్ల కొరత

పాఠశాలలో 564 మంది విద్యార్థులున్నారు. కనీసం 60 నుంచి 70వరకు మరుగు దొడ్లు మరో 70 స్నానాల గదులు ఉంటేగాని సరిపోవు. కాని తాత్కాలికంగా నిర్మించిన మరుగుదొడ్లతో కలిపి ప్రస్తుతం 40 మాత్రమే ఉన్నాయి. 5 నుంచి 10వరకు 452 మంది, 102 మంది ఇంటర్మీడియెట్ విద్యార్థులున్నారు.



కిటికీలు లేని పడక గదులు

స్కూల్ మానిటరింగ్ ఫండ్‌తోనే మరమ్మతులు

స్కూల్ మానిటరింగ్ ఫండ్ కింద గత ప్రభుత్వం రూ.6.68 లక్షల నిధులు మంజూరు చేసింది. అందులో రూ.4 లక్షలతో పాఠశాలలో విరిగిన కొన్ని కిటీలు, మరుగు దొడ్లకు సీట్లు, తలుపులు ఏర్పాట చేశారు. డార్మిటరీలో కిటికీలు ఫ్రేమ్‌లతో సహా పూర్తిగా విరిగిపోయాయి. కొంత మొత్తం వాటి మరమ్మతులకు వినియోగించినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. మరో రూ.2.68 లక్షల ఫండ్ నూతనంగా ఏర్పడిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో వినియోగించాల్సి ఉంది. విద్యార్థుల పడక గదులు అధ్వానంగా ఉన్నాయి. కిటికీలకు ఊచలు ఊడిపోవడంతో కోతులు లోనికి ప్రవేశిస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు.